# గంధంవోలుపు వేలుపు

రచయిత:

కవికొండల వెంకటరావు, బి. ఏ., బి. ఎల్.

శ్రీ సి.హాచలస్వామి ఆది వరాహనరసింహస్వామి అయినా, నాలుక చివరకు వచ్చేసరికి 'సింహాదిరప్పన్న' 'సింహాదిరప్పన్న' అని అనెయ్య బుద్ధి వేస్తుంది : అదేమిటో! 'అప్పన్న' శబ్దం ఇది అచ్చ తెనుగుగాకూడా తోస్తుంది. అయినప్పటికీ ఈశబ్దాన్ని తీసుకుపోయి చాలామంది 'నరసింహం'తో ముడెట్టి 'అప్పల్నరసింహం' అని వ్రాసుకుంటారు. 'అప్పన్న నరసింహము' అనికూడా కాదు. మొత్తంమీద బాగా ఆలోచించిచూస్తే సంస్కృతంమీద ఆంధ్రము బాగా నెత్తెక్కి ఆడినరోజుల్లో 'అప్పన్న' అనే శబ్దం 'ఆదివరాహనరసింహస్వామి'కి జతపడివాటినన్నింటినీ దిగమ్రింగి తానే కొండకు కోమరై పోయినట్టు కనిపిస్తుంది. కాకపోతే పాటల్లోకూడా మేళవింపుగా అతుక్కుపోయి 'సిహ్మాదిరప్పన్న సేవలే సేదాము' అని అంటూ ఆంధ్రలోకం ఈమచ్చుగా తాండవించనేరదు.

ఈ 'అప్పన్న' ఏంచేశాడయ్యా ఇంతకీర్తి సంపాదించడానికి అనేవిషయంకూడా ఆలోచించవలసిందే. అప్పన్నఅంటే మనిషీ కాదు దేవుడూ కాదు నిజానికి పట్టిచూస్తే. అతడు అచ్చోసిన ఆంబోతు. దాన్నే కొన్నిచోట్ల 'తోటపెద్దు' అని ప్రాంతీయంగా వాడుతూ వుంటారు. అచ్చోసిన ఆంబోతంటే వేఱే వర్ణించాలా? నిగనిగలాడే ఎత్తైనమూపురం, గణగణలాడే చిరుగంటలు, ఆచిరుగంటల్లో రింగులోసుకొంటూ వ్రేలాడుతూవుండా అన్నంతశోభస్కరంగా కానవచ్చే గంగడోలు, ఖచ్చితమైన పుచ్ఛం, సుముఖమయినముఖం, నొష్టను పసుపు, పిఱ్ఱల్నిముద్రలు, ఇంకా ఇంకా చెప్పరాని సింగారం ఎంతో వాలికిం చేస్తూవుంటుంది. గుఱ్ఱంఏమిటి, గొఱ్ఱేమిటి, ఇఱ్ఱేమిటి, జఱ్ఱేమిటి, ఏజంతువైనా వయస్సొచ్చి స్వైరంగా తిరుగుతూవుంటే చూడ ముచ్చటేస్తుంది. అందులో మనఅప్పన్న ఆంబోతుకూడాను! అంటే పెద్దావుకుపుట్టి చిన్నావును ప్రేమించే ధీరోదాత్తనాయకుడాయిరి! గొప్పగా కనిపించకుమరి? అందరి దృష్టి ఆకర్షించేస్తాడు ఒక్కొక్క సమయాన్ని అంకెవేశాడాఅంటే! ఒక్కసారి కొమ్ముల్తో తొలకరి తడీపొడీ మట్టి రెమ్మేశాడా అంటే!

ఇటువంటి స్వైరవిహారి అయిన ఆంబోతుకూ, ఒక్కచోట బుద్ధిమంతతనంగా వెలిసిన ఆదివరాహనరసింహస్వామివారికీ పరిచయం ఎలాకలిగిందీ అనేది మిక్కిలీ తలచి తెలుసుకోదగ్గ విషయమే!

వరాహనరసింహులవారు సింహాచలం కొండను వెలిసి విలసిల్లడానికి మహత్తర కారణాలు రెండు గనిపిస్తాయి. ఒకటి మత్స్యావతారమైనాక, కూర్మావతారం, కూర్మావతారమైనాక వరాహావతారం, అది అయినాక

నరసింహావతారం—అవతారాలు పదీకూడా మనభారతవర్షంలో తమతమ స్థానికబలాలు నిర్ధారణచేసుకోవడంలో కొంత వాడిచూపు వినియోగించాయి అని నాతాత్పర్యం. మత్స్యావతారం భూమ్మీద నిల్చే అవతారం కాదు. అయినప్పటికిన్నీ అది భారతవర్ష భూఖండాన్ని సుప్తివంతమై హిమవత్పర్వతంక్రింద అస్థిపంజరప్రసిద్ధిని విలసిల్లుతూవుండని నా నిశ్చితాభిప్రాయం. మఱి కూర్మావతారం శ్రీకూర్మంలో మనందఱికీ కనబడుతూనేవుంది. దిగువకు అలాప్రయాణంచేస్తూ వెతుక్కుంటూవస్తే సింహాచలంలో వరాహావతారం, నరసింహావతారంకూడా గోచరిస్తూవున్నాయి. ఇంతవఱకూ వివరిస్తే చాల్ననుకొంటాను ప్రకృతమ్మట్టుకు.

ఆ అవతారమూర్తులు రెండూ సింహాచలాన్నే ఆశ్రయించి కనబడ్డమేమూఅంటే, అవిరెండూ ఉగ్రమూర్తులే. అంచేత రెండూకూడా మిక్కిలి చల్లనితావును కోరుకుంటూ సఖ్యంగా వొక్కచోటనే సన్నని సెలయేటిధారలు పన్నీటిజల్లుల్లాపడుతూవుండే ఆకొండను వెలిసినాయి. వెలిసి మూర్తీభవించినాయి.

అసలు వొక్కొక్క అవతారం విడివిడిగా సాక్షాత్కరిస్తేనే పట్టరానిసంతోషంతో పైని ముక్కోటి దేవతలు క్రిందముప్పదికోట్ల మానవులూ పూలవర్షంగురియిస్తూ, దీపారాధనగావిస్తూ, ధూపంవేస్తూ, తమలోతాము హర్షించిపోతారుగదా. అలాంటప్పుడు అవతారద్వయంవెలిసినచోట ఎంతపూజాపురస్కారం జరగనైయుండాలి చెప్పండి! అందులోనూ అవి రెండూ వుగ్రమూర్తులైనప్పుడు వాటికి శాంతి యినుమడింపజేయాలీ అంటే ఏంచెయ్యాలి చెప్పండి!

అదే పుష్యడం అదే పుష్యడం అవిగ్రహానికి మంచిగంధం! రాత్రిళ్లు దేవతలుపూసి, పగలు మానవులుపూసి నిక్షేపంగా కాలక్షేపం గావిస్తూవచ్చినారు.

పూలపూజ, కర్పూరనీరాజనారాధన, అగరుధూపసేవ, జరిగినప్పుడు అంతచలించలేదుగాని విగ్రహం గంధంపూత జరిగినప్పుడు మాత్రంచలించింది. పూవులువాడిపోయి గాలికెగిరిపోవడానికి అవకాశంవుంది, దీపారాధన కొంతసేపటికికాకపోతే కొంతసేపటికైనా పెద్దదవడానికి సావకాశంవుంది. ధూపంతనంతటతానే పైకేమేఘశకలంతోనో ఆడుకోవడానికన్నట్టెగసి పోవడానికవకాశముంది. ఒంటికిపూసినగంధం?అది ఎలా వొదిలిపోవడం? అది ఆరితేమఱింతబిగిసి పోవడమే కాకుండా, పూతమీదపూత, పూతమీదపూత, నఖశిఖపర్యంతం పట్టిస్తూవుంటే, రోమకూపాలుపూడిపోయి. 'ఇది పుట్టా? స్వామివిగ్రహమా?' అని అనిపించివేసింది కొన్నాళ్లకు.

అయినాగానీ మానవులుమూర్ఖులు! అంతకన్నామూర్ఖులు దేవతలు! అదేపనిగా చందనం తీసి, ఆ విగ్రహనికి అమేషా రాస్తూవుండడమే తమ వుద్యోగంఅనుకున్నారు. అనుకుని, ఎంతదళసర్కొన్నె చెప్పలేనంతదళసర్ని, నిమ్నోన్నతాలు లేకుండా, విగ్రహాన్ని చందన గర్భితం చేసిపారేశారు.

స్వామి కష్టడనిపించింది. "ఏమిరా! యీ మానవులూ దేవతలూకూడా ఇంతమతిపోయిన వాళ్లైనారు? నారూపాన్ని వారి అర్చనలో చూడలేకపోవడమే మహదాశయంగా పెట్టుకుపనిచేస్తూవున్నట్టు గోచరిస్తున్నారు. వాళ్లకంటె బుద్ధిమంతులు మఱిలేరా? యీభూమ్మీదను" అని కించిన్మీలితనేత్రుడై ఆలోచించారు స్వామివారు.

వర్షము గురిసివెలిసిన బహుళామావాస్య

రాత్రిఅది. వైశాఖమాసం ! మూలకొనెట్ట బడ్డ వెన్నెలకుప్ప అయిందీ, సామివారిచందన స్వరూపంఅయిందీ, తేటపడక ప్రజలూ దేవతలూ అల్లాడిపోతూవున్నారు.

అట్టితరుణంలో మనచక్కని ఆంబోతు అంకెవేసికొంటూ, తనలోంచి పుట్టుకొచ్చిన వుత్సాహంకొద్దీ, స్వామివారినిచేరి తన డెక్కతో ఆలా ఆలా రాచి తనకొమ్ముల్తో ఇలా అలా కెక్కరించి, గంధం లోకులకు కాకులకు విరజిమ్మేసింది.

'అడుగో స్వామి! అక్కడున్నాడు! మనం కానకపోయినాం' అని ప్రజలు మూగిపోయినారు. పైని అజరులు తూగిపోయినారు.

"ఆంబోతు" అనడంమానేసేసి 'అంబన్న' 'ఆవన్న' 'అప్పన్న' ఇలాగ్గా అనడంమొదలు పెట్టినారు. తమకు దివ్యంగా దేవుని పునర్దర్శనంకలిగించిన ఆనలుగాళ్ల దాన్ని తాళాలతో తప్పెట్లతో వూరేగించారు. సింహాద్రిరప్పన్న సేవలేచేదాము!అది ఆదిగా ఏటేటా స్వామికి ఆగంధంవొలుపు! ఇదీ ఏతద్వృత్తాంతము.



కీర్తిశేషుడు

జాన్ డేవిసన్ రాక్‌ఫెల్లర్

జననము :

8-వ జూలై 1839.

మరణము :

23-వ మే 1937.

దరిద్రుడై పుట్టి కిరసనాయిలు పెట్రోలియము మున్నగునూనెల వర్తకముచేసి లోకమందలి ధనికులలో రెండవస్థానమును దాటలలో మొదటిస్థానమును ఆక్రమించినవాడు. ఈతని జీవితవివరములకు 1934 ఫిబ్రవరి ఆంధ్రభూమి సంచిక చూడుడు.